మళ్లీ వచ్చేది జగనన్న పాలనే



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో రాష్ట్ర గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్

- ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీ
- 32వ డివిజన్‌లో పర్యటించిన ఎంపీ భరత్, చందన, బొమ్మన

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టేది జగనన్నేనని ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. సోమవారం స్థానిక 32వ డివిజన్‌లో జాంపేట శివాలయం వద్ద నుంచి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడచిన ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించిందన్నారు. అభివృద్ధిలో పరుగులు పెట్టిందన్నారు. పేదల సంక్షేమానికి సీఎం జగనన్న అగ్రతాంబూలం ఇవ్వడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. పేదరికమే అర్హతగా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపికచేసి వారి జీవన ప్రమాణాలలో పెను మార్పులను సీఎం తీసుకొచ్చారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన ప్రభుత్వమే లేదన్నారు. లక్షల కోట్ల రూపాయలు పేదల బ్యాంకు ఖాతాలలో నేరుగా జమచేసి ప్రజల ఆదరాభిమానాలు జగనన్న పొందారని ప్రజలకు జగనన్న ఒక నమ్మకం, భరోసా అన్నారు. నగరంలో ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం, ఏ ప్రజాప్రతినిధి చేయనంత అభివృద్ధిని తాను చేసి చూపించానన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టసుఖాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, జాంపేట కార్పొరేషన్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్, 32వ డివిజన్ ఇన్‌చార్జి ముప్పన శ్రీను, నగర మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, ఎస్వీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి డాన్ ఆదిరెడ్డి వాసు



రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు గంజాయి డాన్ అని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి, బ్లేడ్, రౌడీ షీటర్స్‌కు అండగా ఉంటున్నాడని దానికి సాక్ష్యాలున్నాయన్నారు. మోసగాళ్లుగా పేరు పొందిన ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి శ్రీనివాస్‌లు తనపై విమర్శలు చేసే అర్హత లేదన్నారు. హైదరాబాదు కూకట్‌పల్లి పరిధిలో ఒక గంజాయి కేసులో అడ్డంగా దొరికిపోయింది వాసు అనుచరుడేనంటూ సోషల్ మీడియాలో హల్‌చల్ అవుతున్న నగరంలోని 46వ వార్డుకు చెందిన జాకీ ఫొటోలను మీడియాకు చూపించారు. హైదరాబాద్ పోలీసులు గంజాయి కేసులో జాకీని అతని బ్యాచ్‌ను ఏ విధంగా పట్టుకున్నదీ వివరించారు. ఇటువంటి సంఘ విద్రోహక శక్తులతో చేతులు కలిపి అక్రమార్జనకు పాల్పడేది ఆదిరెడ్డి కుటుంబమని ఆరోపించారు. అభివృద్ధి పనుల్లో 25 శాతం కమిషన్ తీసుకున్నట్టు అదే పనిగా ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారని, ఒక్క శాతం తీసుకున్నట్టు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎంపీ భరత్ సవాల్ విసిరారు. టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావుకు ఎమ్మెల్సీ భిక్ష మా పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి వేసిందేనన్నారు. ఆ ఎమ్మెల్సీ పదవే లేకుంటే రాజకీయంగా ఆదిరెడ్డి అప్పారావు చాప్టర్ క్లోజ్ అయ్యేదన్నారు.

క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాలతో టెడ్‌లెన్స్ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఆర్ట్స్ కళాశాల, టెడ్‌లెన్స్ ఐటీ సొల్యూషన్స్ ప్రతినిధులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం టెడ్‌లెన్స్ ఐటీ సొల్యూషన్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి సంబంధించిన ఒప్పంద పత్రాలపై టెడ్‌లెన్స్ సీఈఓ రామదేవ్ రామ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు సోమవారం కళాశాలలో సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం టెడ్‌లెన్స్ సంస్థ కళాశాలలో సెంటర్ ఫర్ టెక్నికల్ ఎక్సలెన్స్ స్థాపించి, విద్యార్థులకు వివిధ ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధనకు శిక్షణ ఇస్తుంది. దీంతోపాటు స్టార్టప్ కంపెనీల స్థాపనకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించాలి. విద్యార్థులు మంచి ఉద్యోగాలు పొందేలా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ఈ ఒప్పందం తోడ్పడుతుంది. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సునీల్ కుమార్ దువ్వూరి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షకు 22 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షల్లో తెలుగు పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి ఏఆర్‌కేడీ తులసీదాస్ తెలిపారు. మండలంలో 15 పరీక్షా కేంద్రాల్లో 3124 మంది విద్యార్థులకు గాను 3102 మంది మాత్రమే హాజరయ్యారన్నారు.

20 నుంచి జనార్దన స్వామి కల్యాణోత్సవాలు

కడియం: స్థానిక జనార్దన స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఈ నెల 20వ తేదీన నుంచి ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు వేదాంతం చక్రపాణి, ఈవో వీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాలు 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. 20న తీర్థం, రథోత్సవం, స్వామి కల్యాణం జరగనున్నట్టు వివరించారు.

నిబంధనల ప్రకారం వ్యవహరించాలి



సచివాలయ సిబ్బందిని ఆరా తీస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

కడియం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను తుచ తప్పకుండా పాటించాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని వేమగిరి, కడియం, కడియపుసావరం గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో ఎన్నికల కోడల్ అమలు తీరుపై ఆరాతీశారు. నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించి ఇబ్బందులను కొనితెచ్చుకోవద్దని సూచించారు.

చందన నాగేశ్వర్ పరామర్శ



మహాలక్ష్మి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ సోమవారం మండలంలోని పలువురిని పరామర్శించారు. కడియపులంకలోని రావిపాటి మహాలక్ష్మి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. వారి కుమారులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వీరవరంలో బత్తుల బ్రహ్మకుమార్ మృతికి సంతాపం వ్యక్తం చేసి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ఎన్నికల్లో పోటీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాల్లోనూ పార్టీ తరపున పోటీ చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి భారతీయ చైతన్య పార్టీ దరఖాస్తులను కోరుతోందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టా కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలో పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులతో పాటు, స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థులకు తమ పార్టీ మద్దతిస్తుందన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పేదరికాన్ని, నిరుద్యోగాన్ని నిర్మూలించేలా, ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా పార్టీ కార్యాచరణను రూపొందించిందన్నారు. తమ పార్టీ జనాభా ప్రాతిపదికన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు సీట్లు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఆర్ట్స్ కళాశాలలో సింగిల్ మేజర్ వ్యవస్థపై శిక్షణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నోడల్ రిసోర్స్ విభాగంలో డిగ్రీలో సింగిల్ మేజర్ విధానంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2023 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు సింగిల్ మేజర్ సిస్టంను ప్రవేశపెట్టామని, ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ కమిషనరేట్ సింగిల్ మేజర్‌పై అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి.ప్రతిమ, కాకినాడ ఏఎస్‌డీ కళాశాలకు చెందిన శిరీష రెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.అన్నపూర్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.సంజీవ్‌కుమార్, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

లేపాక్షి ఎంపోరియంలో 'థీమెటిక్ ఎగ్జిబిషన్'

సీటీఆర్ఐ: లేపాక్షి ఎంపోరియంలో మంగళవారం నుంచి 23వ తేదీ వరకూ థీమెటిక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో నేరుగా తయారీదారులు చేసిన హస్తకళలను వారే అమ్ముకుంటారన్నారు. వైట్‌వుడ్ బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లెదర్ పప్పెట్, కళంకారి వస్తువులు తయారు చేసే వారు లేపాక్షి షోరూమ్‌లో తమ వస్తువులను విక్రయించుకుంటారని తెలిపారు. ఇక్కడ 10 శాతం నుంచి 40 శాతం వరకూ డిస్కౌంట్ లభిస్తుందని లేపాక్షి నగర సంస్థ మేనేజర్ మోనిక తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ విధులు అత్యంత కీలకం

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాల విధులు అత్యంత కీలకమని రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.తేజ్ భరత్ పేర్కొన్నారు. సోమవారం ఆయన రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం, స్టాటిక్ సర్వైలెన్స్ బృందం, వీడియో విజిలెన్స్ సర్వైలెన్స్ బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించడంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వైల్ బృందాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. బృందాలు వారి బాధ్యత సక్రమంగా నిర్వహించాలన్నారు. నిఘా నిర్వహించడం తోపాటు ఎప్పటికప్పుడు నివేదికలు పంపాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబు, రాజమండ్రి రూరల్ తహసీల్దార్ వై.కె.వి అప్పారావు, కడియం తహసీల్దార్ వి.రమాదేవి, ప్లానింగ్ అధికారి కోటయ్య పాల్గొన్నారు.



ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

వైటీసీ శిక్షణ కార్యాలయంలో ఏర్పాట్ల పరిశీలన

వివిధ విభాగాల ద్వారా నిర్వర్తించే ఎన్నికల విధుల కోసం స్థానిక వైటీసీ ప్రాంగణంలో చేసిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. సోమవారం సాయంత్రం వైటీసీ శిక్షణ కార్యాలయ ఆవరణలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగంగా 16 విభాగాల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఆ మేరకు అక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి విధులను నిర్వర్తించడం కోసం తాత్కాలికంగా ఆయా విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పూర్తి స్థాయిలో విధులను నిర్వర్తించడం కోసం అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలను చేస్తున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి అతి సమీపంలో వున్న వైటీసీ కేంద్రం వద్ద అందుకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిబాబా, తహసీల్దార్ అప్పారావు, వి.రమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించకుంటే చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దాటి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని కమిషనర్ దినేష్‌కుమార్ సోమవారం హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రాజమహేంద్రవరం అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో ఏవిధమైన రాజకీయ ప్రకటనలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై మోటారు వాహనాలపై, ఇతర ప్రచారాలని నిషేధించామన్నారు. ప్రైవేట్ పాసంజర్ ఆటో, కార్లపై రాజకీయ ప్రకటనలను ఏర్పాటు చేయకూదన్నారు. వాహన యజమానులు తమ వాహనాలపై రాజకీయ ప్రకటనలను వెంటనే తొలగించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై మోటార్ వెహికల్ యాక్ట్, ఎన్నికల నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దినేష్‌కుమార్ హెచ్చరించారు.

జగన్ మళ్లీ సీఎం కావాలి

జగనన్న వన్స్‌మోర్ నినాదంతో అలిపిరి నుంచి తిరుపతికి పాదయాత్ర చేపట్టిన ముద్దాల

రాజమహేంద్రవరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు(అను) '2024 జగనన్న వన్‌మోర్' అనే నినాదంతో అలిపిరి నుంచి తిరుపతికి పాదయాత్ర చేపట్టారు. సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, 175కు 175 అసెంబ్లీసీట్లు, 25 ఎంపీ సీట్లు సాధించాలని తిరుపతి వేంకటేశ్వరుడిని వేడుకున్నట్టు తెలిపారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, డాక్టర్ తానేటివనిత, ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యేలు తలారి వెంకటరావు, జి.శ్రీనివాసనాయుడు, డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని స్వామివారిని వేడుకున్నట్టు తెలిపారు.



అలిపిరి నుంచి మెట్ల మార్గంలో తిరుపతికి నడిచి వెళుతున్న ముద్దాల అను

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని జేఎన్‌రోడ్ జేకే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన, విక్రయాలు మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ సోమవారం తెలిపారు. గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50కు పైగా డిజైనర్స్ రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబాయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లను తీసుకొచ్చిన వస్త్రాలను పరిచయం చేస్తున్నామన్నారు. ఈ ప్రదర్శన 20వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న మహిళలు

రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అడ్వైజర్‌గా గురుదత్త ప్రసాద్

అభినందించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అడ్వైజర్‌గా మేడా గురుదత్త ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఈనెల 16వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఐక్యరాజ్య సమితి అవార్డు పొందిన మేడా గురుదత్ ప్రసాద్ జనసేన పార్టీలో రాజానగరం నియోజక వర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించి ఇటీవల ఆ పార్టీతో విభేదించి వైఎస్సార్ సీపీలో చేరారు. సోమవారం రాజమహేంద్రవరం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు. అదేవిధంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కూడా గురుదత్త ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.



గురుదత్త ప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు సంఘటితం కావాలి

కంబాలచెరువు: స్థానిక పేపర్ మిల్ మెయిన్ సమీపంలో ఉన్న శ్రీకృష్ణ సాయి కళ్యాణ మండపంలో మంగళవారం రాజమహేంద్రి ప్రైవేటు కాలేజెస్ అండ్ స్కూల్స్ అసోసియేషన్ సమావేశం సోమవారం జరిగింది. రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రైవేట్ స్కూల్స్, జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. ప్రైవేట్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రూసా సభ్యులు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కలిసికట్టుగా సంఘటితమై ఒక యూనియన్‌గా ఏర్పాటు కావాలన్నారు. సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు సుంకర మురళి, గంగాధర చౌదరి, కళ్యాణ్ రెడ్డి, ప్రసాద్, సురేష్, గోవిందరాజులు, సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వరరావు, పలు విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ విశ్వేశ్వరరెడ్డి

గోదావరి రైల్వే స్టేషన్ అభివృద్ధి సలహా కమిటీ నియామకం



కమిటీ సభ్యులుగా నియమితులైన సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం గోదావరి రైల్వే స్టేషన్ అభివృద్ధి సలహా కమిటీ సభ్యులుగా రైల్వేశాఖ పలువురుని నియమిస్తూ రైల్వేశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కారుమూరి సురేష్, పి.సురేంద్ర, కృష్ణమాచార్యులు, తంగేళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్‌లను నియమించింది. సందర్భంగా స్టేషన్ మేనేజర్ ఆరవ నాగేంద్ర సభ్యులను కలిసి స్టేషన్‌లోని ఇబ్బందుల గురించి చర్చించారు. స్థానిక బీజేపీ నాయకులు కురగంటి సతీష్ పిల్లాడి రుద్రయ్య, లలిత్ కుమార్‌జైన్, విజయ్ కిరణ్ పలువురు పాల్గొన్నారు.

డెయిరీ ఫుడ్స్‌పై విజిలెన్స్ దాడులు

రాజానగరం: దివాన్‌చెరువులోని బాబా డైరీ ఫుడ్స్ (ఐస్ క్రీమ్ తయారీదారులు)పై రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ప్యాకింగ్‌కి లైసెన్స్ లేకపోవడం, కొన్ని ప్యాకెట్లపై తయారైన తేదీ, ఇతర వివరాలు ప్రచురించకపోవడంపై కేసు నమోద చేశారు. టెస్టుల కోసంకొన్ని నమూనాలను సేకరించారు. ఇప్పటికే ట్రేడ్ లైసెన్స్ పొందకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి రూ.2024 ఫైన్ వేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐస్ తయారీ, విక్రయించేవాళ్లు, స్వీట్ స్టాల్స్, రెస్టారెంట్స్ యజమానులు కచ్చితంగా పరిశుభ్రతలను పాటించాలని, స్టేఫ్టీ అధికారుల సూచనలను పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విజిలెన్స్ అధికారులు ముత్యాల నాయుడు, భార్గవ రమేష్, జగన్నాథరెడ్డి, కిషోర్‌లతో పాటు ఫుడ్స్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

బీసీ కన్వెన్షన్ హాలుకు శంకుస్థాపన చేయడంపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న బత్తిన అప్పారావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామంలో రూ.40 లక్షలతో బీసీ కన్వెన్షన్ హాలు నిర్మాణానికి ఈనెల 14వ తేదీన రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం శాటిలైట్‌సిటీ ఏ బ్లాకులో వైఎస్సార్ సీపీ నేతలు, బీసీలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన అప్పారావు మాట్లాడుతూ బీసీ కమ్యూనిటీ హాలు కావాలని మంత్రి వేణుగోపాలకృష్ణను అడిగిన వెంటనే రుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ద్వారా రూ.40 లక్షలతో బీసీ కన్వెన్షన్ హాలు మంజూరు చేసి శంకుస్థాపన చేయడం హర్షణీయమన్నారు. బీసీ కన్వెన్షన్ హాలు మంజూరుకు కృషి చేసిన మంత్రి వేణుగోపాలకృష్ణ, రుడా చైర్మన్ రౌతుసూర్యప్రకాశరావు, ఉభయరాష్ట్రాల శెట్టిబలిజసంఘ అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఉపసర్పంచ్ బొమ్మశ్రీను, సఫారినాయుడు, దత్తసాయి, కుడపూడి పద్మ, గాదె అనురాధ, వడిశెలనారాయణ, ధర్మవరపు శ్రీనివాస్, పి.వెంకటేష్, డి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒనువులమ్మకు పూజలు



ఒనువులమ్మతల్లి



ఒనువులమ్మతల్లి వార్షికోత్సవం సందర్భంగా సామూహిక కుంకుమపూజ చేస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలోని ఒనువులమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి ఉత్సవ మూర్తికి మహిళా భక్తులు క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామంలో వేద పండితుల సమక్షంలో, మేళతాళలతో మహిళలు కలశాలతో గ్రామ పుర వీధులలో అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక కుంకుమ పూజ, అమ్మవారికి లక్ష పుష్పాలతో అర్చన చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళ భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కిక్ బాక్సింగ్‌లో 'నన్నయ'కు కాంస్యం



దినేష్‌ను అభినందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు, తదితరులు

రాజానగరం: ఆలిండియా యూనివర్సిటీస్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్యార్థి సీహెచ్ దినేష్ కాంస్య పతకాన్ని సాధించారు. మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో జరిగిన ఈ పోటీల్లో కిక్ బాక్సింగ్ పురుషుల విభాగం 81 కిలోల కేటగిరిలో యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దినేష్ కాంస్య పతకాన్ని అందుకున్నాడని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని వీసీతోపాటు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ బి. రామ్‌గోపాల్, కర్నల్ సత్యనారాయణ, పీడీ డాక్టర్ మధుకుమార్, రాజోలు కళాశాల అధ్యాపకుడు ఎస్.రాజు తదితరులు అభినందించారు.